సాక్షి విశాఖపట్నం

గురువారం । 3 । జూలై । 2025



వానొస్తే వణుకే.! 8లో




వినియోగదారుల అవసరాలే వ్యాపార అభివృద్ధికి కీలకం 8లో



వాన వాన 8లో

రూ. 208 కోట్ల టీడీఆర్‌కు స్కెచ్!

మధురవాడలోని ఓ భూమికి సంబంధించిన ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్) వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో జారీచేసిన టీడీఆర్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో వెనులుబాటు.. కూటమి నేతల జేబులు నింపుకునేందుకేనని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ అవకాశాన్ని అనరాగా చేసుకుని ఒక ఎమ్మెల్యే, మంత్రి సుమారు రూ.50 కోట్ల భారీ ఒప్పందానికి తెరలేపినట్లు అధికార కూటమిలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.



- రద్దు పేరుతో కపట నాటకం
- కొత్తగా దరఖాస్తు చేసుకోవాలంటూ మెలిక
- ఓ మంత్రి, ఎమ్మెల్యే అండదండలతో వ్యవహారం
- తాజాగా టీడీఆర్ కోసం దరఖాస్తు
- రూ.50 కోట్లకు డీల్ కుదిరినట్టు కూటమిలోనే గుసగుసలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

మధురవాడ గ్రామం సర్వే నంబర్ 2పీకి చెందిన భూమికి సంబంధించి పీఎల్ఎన్ రాజు పేరుతో జారీచేసిన టీడీఆర్‌ను గత నెల 5వ తేదీన మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వాస్తవానికి ఈ టీడీఆర్ జారీచేయకూడదని, ఇందులో భారీగా మతలబు జరిగిందంటూ కూటమి నేతలు గతంలో విమర్శలు గుప్పించారు. ప్రైవేటు వ్యక్తులు తమ లేఅవుట్ కోసం రహదారి ఏర్పాటు చేసుకున్న తర్వాత, దానికి టీడీఆర్ ఎలా జారీ చేస్తారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం టీడీఆర్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అయితే రద్దు ఉత్తర్వుల చివర్లో 'కొత్త దరఖాస్తులను టీడీఆర్ కమిటీ ముందుంచి నిర్ణయం తీసుకోవాలి' అని ఒక మెలిక పెట్టింది. ఇప్పుడు ఇదే అంశాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు నగరంలోని ఓ ఎమ్మెల్యేతో పాటు మంత్రి కూడా రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో రూ.50 కోట్ల డీల్ కుదరడంతో.. కొద్ది రోజుల కిందట అదే సర్వే నంబర్ 2పీకి టీడీఆర్ కోసం మళ్లీ దరఖాస్తు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీనికి అనుగుణంగా టీడీఆర్ జారీకి రంగం సిద్ధమవుతోందని తెలుస్తోంది. వాస్తవానికి టీడీఆర్ రద్దు ఉత్తర్వుల్లో ఎక్కడా విచారణ జరిపినట్టు గానీ, అధికారులను బాధ్యులను చేయడం గానీ జరగలేదు. కేవలం కొత్త ఒప్పందం కోసమే రద్దు నాటకం ఆడారని, అందుకే గతంలో ఆరోపణలు చేసిన కూటమి నేతలు ఇప్పుడు మౌనంగా ఉన్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అసలు కథ ఇదీ!

పూసపాటి లక్ష్మీ నరసింహరాజుకు రేవళ్లపాలెం ప్రాంతంలో 233 ఎకరాల భూమి ఉంది. రహదారి నిర్మాణంలో ఆయన కోల్పోయిన 9,475.71 చదరపు గజాల స్థలానికి సంబంధించి, అతని కుమారుడైన జోగి జగన్నాథ దేవ వర్మకు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) ఇచ్చారు. ఆ జీపీఏ హోదాలో ఆయన టీడీఆర్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. జీవీఎంసీ అధికారులు నిబంధనల ప్రకారం కోల్పోయిన భూమికి నాలుగింతలు, అంటే 37,902.84 చదరపు గజాలకు టీడీఆర్‌ను జారీ చేశారు. అప్పట్లో గజం విలువ రూ. 55,000గా పేర్కొనడంతో.. ఈ టీడీఆర్ మొత్తం విలువ రూ. 208.40 కోట్లకు చేరింది. తదనంతరం ఈ టీడీఆర్ హక్కులను సదరు యజమాని సాయికృష్ణారెడ్డికి బదిలీ చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఈ ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు అందడంతో టీడీఆర్‌ను రద్దు చేస్తున్నట్టు మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ ఆదేశాలు జారీచేశారు.

రంగంలోకి సీనియర్ ఎమ్మెల్యే?

మధురవాడ జాతీయ రహదారి నుంచి రేవళ్లపాలెం మీదుగా నవోదయ పాఠశాల వరకు 2014లో రహదారి నిర్మాణం చేపట్టారు. ఈ రహదారి నిర్మాణం వల్ల 2పీ సర్వే నంబర్‌లోని 9,475.71 చదరపు గజాల భూమిని కోల్పోయామని టీడీఆర్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఈ టీడీఆర్‌ను రద్దు చేసినప్పటికీ, కొత్త దరఖాస్తులకు అవకాశం ఇవ్వడం వెనుక ఉన్న ఆంతర్యం ఇప్పుడు బయట పడుతోంది. టీడీఆర్ రద్దయిన తర్వాత నగరానికి చెందిన ఒక సీనియర్ టీడీపీ ఎమ్మెల్యే రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఒక మంత్రితో మాట్లాడి రూ.50 కోట్ల ఒప్పందం కుదిర్చారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ డీల్ ఖరారైన తర్వాతే తిరిగి అదే సర్వే నంబర్‌పై టీడీఆర్ కోసం దరఖాస్తు చేశారని సమాచారం. ప్రస్తుతం ఈ దరఖాస్తు పురపాలక శాఖ పరిశీలనలో ఉంది. అంతా సవ్యంగా జరిగితే త్వరలోనే టీడీఆర్ జారీ అయ్యే అవకాశాలున్నాయని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇదే జరిగితే కేవలం కొత్త డీల్ కోసమే టీడీఆర్ రద్దు నాటకాన్ని ఆడారన్నది స్పష్టమవుతుంది.

డబుల్ డెక్కర్ బస్ ట్రయల్ రన్

- నగరవాసులకు త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం
- పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్



డబుల్ డెక్కర్ బస్ వద్ద పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్

అల్లిపురం / కొమ్మాది : విశాఖ నగర ప్రజలు, యాత్రికులకు డబుల్ డెక్కర్ బస్సులు త్వరలో అందుబాటులోకి వస్తాయని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ పేర్కొన్నారు. బుధవారం టూరిజం అభివృద్ధి కార్యక్రమాలపై విశాఖ జిల్లాకు విచ్చేసిన ఆయన సాగర్‌నగర్ బీచ్ వద్ద ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయం ప్రాంగణంలో డబుల్ డెక్కర్ బస్సులు, సంబంధిత చార్జింగ్ స్టేషన్‌ను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్ జైన్ మాట్లాడుతూ త్వరలో హాప్ ఆన్ – హాప్ ఆఫ్ పేరుతో డబుల్ డెక్కర్ బస్సులు నగరంలో అందుబాటులోకి రానున్నాయన్నారు. అందుబాటులో ఉన్న రెండు డబుల్ డెక్కర్ బస్సులతో ట్రయల్ రన్ నిర్వహించారు. టూరిజం ద్వారా విశాఖ నగరం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్, టూరిజం శాఖ సంయుక్తంగా విశాఖ పోర్ట్ అథారిటీ సౌజన్యంతో వీటిని అందుబాటులోకి తీసుకురానుందని తెలిపారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ విశాఖ నగర ప్రజలు, పర్యాటకుల ఆహ్లాదకర ప్రయాణానికి డబుల్ డెక్కర్ బస్సులు అనువుగా ఉంటాయన్నారు.

న్యూస్‌రీల్

వామనుడిగా జగన్నాథుడు



దాబాగార్డెన్స్: టర్నర్ చౌల్ట్రీలో జగన్నాథస్వామి వామనావతారంలో బుధవారం దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సామూహిక లలితా సహస్రనామ పారాయణ, సామూహిక భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి, ఫెస్టివల్ ఆఫీసర్ టి.అన్నపూర్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. రథయాత్రలో భాగంగా గురువారం జగన్నాథస్వామి పరశురామావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

5 నుంచి తుది విడత చందనం అరగదీత



చందనం చెక్కలను ముక్కలుగా కోస్తున్న ఉద్యోగి సాంబ

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈ నెల 5 నుంచి తుది(4వ) విడత చందనం అరగదీతను ప్రారంభించేందుకు దేవస్థానం వైదిక, అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు బుధవారం చందనం చెక్కలను అరగదీతకు అనువుగా ఉద్యోగి సాంబ ముక్కలుగా కోశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ నెల 10న ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఆ రోజు స్వామికి తుది విడతగా మూడు మణుగుల(సుమారు 125 కిలోలు) పచ్చి చందనం సమర్పిస్తారు. ఆ చందనాన్ని సమకూర్చేందుకు అరగదీతను చేపట్టనున్నారు. ఏడాదిలో స్వామికి నాలుగుసార్లు మూడు మణుగుల చొప్పున చందనాన్ని సమర్పిస్తారు. చందనోత్సవం రోజు, వైశాఖ పౌర్ణమి, జ్యేష్ట పౌర్ణమి, ఆషాఢ పౌర్ణమి రోజుల్లో ఈ చందన సమర్పణ ఉంటుంది.

9న జెడ్పీ సర్వ సభ్య సమావేశం

మహారాణిపేట: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఈ నెల 9న జరగనుంది. ఈ సమావేశంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాల నుంచి జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు పాల్గొంటారని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి విశాఖ జిల్లా అధికారులు తమ ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని సీఈవో కోరారు.

బెంగళూరు-మాల్డా టౌన్ మధ్య స్పెషల్ రైలు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బెంగళూరు-మాల్డాటౌన్-బెంగళూరు మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఎస్ఎంవీ బెంగళూరు-మాల్డా టౌన్(06565) స్పెషల్ రైలు ఎస్ఎంవీ బెంగళూరులో ఈ నెల 13వ తేదీ రాత్రి 11.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 6.13 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 6.15 గంటలకు బయలుదేరి మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు మాల్డాటౌన్ వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో మాల్డా టౌన్-ఎస్ఎంవీ బెంగళూరు(06566) స్పెషల్ ఈ నెల 16వ తేదీ (బుధవారం) సాయంత్రం 4 గంటలకు మాల్డా టౌన్‌లో బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.33 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 3.35 గంటలకు బయలుదేరి మరుసటిరోజు శుక్రవారం మధ్యాహ్నం 12.45 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు వెళ్తుంది.

నేటి నుంచి జీవీఎంసీ కమిషనర్ హర్యానా పర్యటన

అల్లిపురం: జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఈ నెల 3, 4 తేదీల్లో హర్యానాలో పర్యటించనున్నారు. 'రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి పట్టణ స్థానిక సంస్థలు'అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి సదస్సులో ఆయన పాల్గొంటారు. ఈ మేరకు లోక్‌సభ జనరల్ సెక్రటరీ ఆదేశాల ప్రకారం మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు తెలియజేద్దాం

- 5న 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం
- విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు పిలుపు



మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు

మహారాణిపేట: వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాలులో ఈ నెల 5న నిర్వహించనున్న 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులు, వివిధ అనుబంధ సంస్థల నాయకులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ.. 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా స్థాయి నుంచి మండల, వార్డు, గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లాలని సూచించారు. ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖులు

జిల్లా స్థాయి 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్ కుమార్, మళ్ల విజయ ప్రసాద్, మజ్జి శ్రీనివాసరావు, మొల్లి అప్పారావు, తిప్పల దేవన్ రెడ్డితో పాటు శాసన మండలి సభ్యులు, మాజీ శాసన సభ్యులు, మాజీ మేయర్ హాజరవుతారని కె.కె.రాజు వెల్లడించారు. ఈ సమావేశంలో సమన్వయకర్త మొల్లి అప్పారావు, పార్టీ ముఖ్య నాయకులు ఫరూక్, సతీష్ వర్మ, ద్రోణంరాజు శ్రీవాత్సవ, అల్లంపల్లి రాజాబాబు, అనుబంధ విభాగం అధ్యక్షులు ఉరుకూటి రామచంద్ర రావు, పేడాడ రమణి కుమారి, సనపల రవీంద్ర భరత్, వంకాయల మారుతీ ప్రసాద్, దేవరకొండ మార్కండేయులు, బొండా ఉమా మహేశ్వర రావు, కర్రి రామారెడ్డి, బర్కత్ అలీ, పులగం కొండారెడ్డి, సేనాపతి అప్పారావు, బోని శివ రామకృష్ణ, పీలా ప్రేమ కిరణ్ జగదీష్, చిక్కాల సత్యనారాయణ, జోన్ విభాగం అధ్యక్షులు అంబటి నాగ వినాయక శైలేష్, కార్పొరేటర్లు రెయ్యి వెంకట రమణ, కరజాడ వెంకట నాగ శశికళ, పద్మా రెడ్డి, అనుబంధ విభాగం రాష్ట్ర నాయకులు నీలి రవి, నీలపు కాళిదాస్ రెడ్డి, బెందాళం పద్మావతి, కె.వి.బాబా, బయ్యవరపు రాధ, ఈతలపాక విజయ భాస్కర్, తుమ్మలూరు జగదీష్ రెడ్డి, ఆకెళ్ల వెంకట రమణ మూర్తి, సరగడం పతిని రావు, ప్రగడ ప్రసాద్, బెవర జగదీశ్వరరావు, గోపిరాజ్ వంక, జగుపిల్ల నరేష్, కనకళ ఈశ్వరరావు, మల్లా దేవి విశాలి, బోస రామ లక్ష్మి, బొర్రా విజయలక్ష్మి, కాంట్రేడి రామన్న పాత్రుడు, తుల్లి చంద్రశేఖరరావు, పోతిబంతి హరికృష్ణ, రేఖ ఉషా రాణి, బాణాల తరుణ్ కుమార్, చేకూరి హరీష్ వరం, పులగం శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ చరిత్రలో 'క్రూయిజ్ టెర్మినల్' ఓ మైలురాయి

- వర్చువల్‌గా కార్డేలియా షిప్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి సోనోవాల్
- రాష్ట్రంలో క్రూయిజ్ టూరిజం అభివృద్ధికి కృషి చేస్తామని హామీ
- విశాఖ క్రూయిజ్ టెర్మినల్ నుంచి బయలుదేరిన క్రూయిజ్ షిప్



కార్డేలియా షిప్ ఎక్కి అభివాదం చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ భరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ



కార్డేలియా షిప్ (ఇన్‌సెట్) వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్

సాక్షి, విశాఖపట్నం : విశాఖ చరిత్రలో అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ ఓ మైలురాయి అని కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ అన్నారు. బుధవారం పోర్టు అడ్మినిస్ట్రేటివ్ సమావేశ మందిరంలో కార్డెలియా క్రూయిజ్ షిప్ విశాఖ-చెన్నై సర్వీస్‌ను వర్చువల్ విధానంలో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నేరుగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, కలెక్టర్ ఎం.హరేందిర ప్రసాద్, పోర్టు చైర్మన్ అంగముత్తు పాల్గొన్నారు. పోర్టు అడ్మినిస్ట్రేషన్ సమావేశం మందిరంలో కార్డెలియా టూరిజం షిప్‌లో ప్రయాణించే కుటుంబాలకు కందుల దుర్గేష్ బోర్డింగ్ పాస్‌లు అందజేశారు. అనంతరం విశాఖ పోర్టులో అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్‌కు చేరుకున్న కార్డెలియా క్రూయిజ్ షిప్‌ను సందర్శించారు. క్రూయిజ్ నౌకలో వసతులు, పర్యాటకులకు అందించే సౌకర్యాలు, ప్రయాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీటీడీసీ ఏర్పాటు చేసిన పర్యాటక స్టాళ్లను మంత్రి దుర్గేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించారు. అనంతరం టెర్మినల్ బిల్డింగ్, స్పెషల్ లాంజ్, టూరిజం ఆపరేటర్స్ కౌంటర్స్ తదితర అంశాలను పరిశీలించారు. బుధవారం సాయంత్రం 7.30 గంటలకు విశాఖ నుంచి క్రూయిజ్ షిప్ బయలుదేరింది. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ విశాఖ పోర్టు అథారిటీ అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ ఏర్పాటు చేయడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్రంలో వీలైనంత త్వరగా క్రూయిజ్ టూరిజంను మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ విశాఖ పోర్టుకు మరిన్ని క్రూయిజ్ లైనర్లు రావాలని ఆకాంక్షిస్తూ, అందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ ప్రతి 50 కిలోమీటర్లకు ఒక సముద్ర సంబంధిత కేంద్రంగా, షిప్ బిల్డింగ్, స్కిల్ డెవలప్‌మెంట్, కోస్టల్ లేదా క్రూయిజ్ టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రతీ ఏడాది 5,000 మంది విద్యార్థులకు క్రూయిజ్ ఆధారిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కల్పించి, ఉపాధి అవకాశాలకు సిద్ధం చేస్తామని వెల్లడించారు. వర్చువల్ విధానంలో కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలరవాణా సహాయ మంత్రి శాంతను ఠాకూర్, కేంద్ర సెక్రటరీ రామచంద్రన్ పాల్గొన్నారు.

నగరంలో ఏఐ నిఘా నేత్రాలు

- నేరాలు, ట్రాఫిక్ నియంత్రణపై పోలీసుల ప్రత్యేక దృష్టి
- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఆటోమేటిక్‌గా చలానా
- కలెక్టరేట్‌లో ప్రజెంటేషన్ ఇచ్చిన సాఫ్ట్‌వేర్ సంస్థలు



విశాఖ సిటీ : ట్రాఫిక్ పోలీసులు లేరని సిగ్నల్ జంప్ చేద్దామని.. పోలీసుల చూపు మరల్చి ట్రిపుల్ రైడింగ్‌లో దూసుకుపోదామని.. హెల్మెట్ ధరించకుండా బైక్‌లపై రోడ్ల మీద చక్కర్లు కొట్టేద్దామని.. నేరాలు చేసి దర్జాగా నగర రోడ్లపై తిరుగుదామనుకుంటే ఇకపై కుదరదు. మూడో కన్ను ఇట్టే పట్టేస్తుంది. చలానా వేసేస్తుంది. వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే సీసీ కెమెరాల ఏర్పాటుకు నగర పోలీస్ శాఖ కసరత్తును వేగవంతం చేసింది. ఇందుకోసం ముఖ ఆధారిత గుర్తింపు సాంకేతికతను నగరంలో ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది.

7,500లకు పైగా సీసీ కెమెరాలు

జిల్లాలో ప్రస్తుతం 7,500లకు పైగా సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి. ప్రస్తుతం 90 శాతం కేసులు ఈ నిఘా కెమెరాల ద్వారానే పరిష్కారమవుతున్నాయనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. దీంతో నగరంలో ఈ సీసీ కెమెరాల సంఖ్యను విస్తృతం చేయాలని సీపీ నిర్ణయించారు. నగరంలోనే కాకుండా, శివారు ప్రాంతాల్లో సైతం ప్రజలు వెళ్లగలిగే అన్ని చోట్లా ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులు గట్టి నిర్ణయంతో ఉన్నారు. వీటివల్ల నగరంలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్నారు.

ఏఐ ద్వారా ట్రాఫిక్ నిర్వహణ

జిల్లాలో పోలీసులు ట్రాఫిక్ రద్దీ నియంత్రణతో పాటు నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ ధారణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. కొన్ని జంక్షన్లలో తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు పాటించని వారికి చలానాలు వేస్తున్నారు. ఇకపై ఇటువంటి మాన్యువల్ విధానానికి స్వస్తి చెప్పి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఫైన్‌లు వేసే విధానాన్ని అమలు చేసేందుకు పోలీసులు కసరత్తు చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత రోడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌ను అమలు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నగర పరిధిలో ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు దేశంలోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలను ఆహ్వానించారు. సదరు కంపెనీల ప్రతినిధులు బుధవారం కలెక్టరేట్‌లో ఎంపీ భరత్, కలెక్టర్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సమక్షంలో ప్రజెంటేషన్ ఇచ్చారు.

ఆటోమేటిక్‌గా చలానాలు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ట్రాఫిక్ వ్యవస్థ ద్వారా అతివేగం, పరిమితికి మించి వాహనాన్ని నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణం, సిగ్నల్ జంపింగ్, రాంగ్ పార్కింగ్, రాంగ్ రూట్ వంటి ట్రాఫిక్ ఉల్లంఘనులు దొరికిపోనున్నారు. వారికి ఆటోమేటిక్‌గా ట్రాఫిక్ చలానాలు జారీ అయిపోతాయి. అలాగే ముఖ ఆధారిత గుర్తింపు సాంకేతికతను నగరంలో ప్రవేశపెట్టనున్నారు. అలాగే నగర జంక్షన్లలో గల సిగ్నలింగ్ వ్యవస్థను ఏకీకృతం చేయనున్నారు. తద్వారా ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని పోలీసులు భావిస్తున్నారు. అలాగే ట్రాఫిక్ రద్దీని బట్టి సిగ్నల్ వ్యవస్థ పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

'సుపరిపాలనలో తొలిఅడుగు' బహిష్కరణ



అన్నవరంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలోపాల్గొన్న గంటా

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీలో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు డీఏఎస్ రాజు, అతని వర్గం బహిష్కరించింది. ఇప్పటికే ఆరుసార్లుగా మండల పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న డీఏఎస్ రాజు స్థానంలో కొత్త అధ్యక్షుడి కోసం పార్టీలో విస్తృతంగా చర్చలు జరిగాయి. రాజు, యరబాల అనిల్‌ప్రసాద్ పేర్లు ప్రతిపాదించినప్పటికీ.. ఏడాది కిందట ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సరగడ అప్పారావు పేరును ప్రతిపాదించి పార్టీ అధిష్టానానికి పంపించారు. దీనిని వ్యతిరేకించిన రాజు, అనిల్ ప్రసాద్ వర్గం ఎంపీ భరత్ ద్వారా నిలుపుదల చేయించి విజయం సాధించారు. దీంతో ప్రతి పంచాయతీలో టీడీపీ రెండు వర్గాలుగా విడిపోయింది. ఈ క్రమంలో డీఏఎస్ రాజు పార్టీకి దూరంగా ఉండిపోవడంతో అతని వర్గానికి పార్టీ కార్యక్రమాల గురించి ఎవరూ సమాచారం అందించడం లేదు. దీంతో రాజు వర్గం ఇతర పార్టీల వైపు చూస్తోంది. సరగడ అప్పారావు కంటే అనిల్ ప్రసాద్ కార్యకర్తలతో కలిసి పని చేస్తాడని గుర్తించడంలో ఎమ్మెల్యే గంటా విఫలం అయ్యారని రాజు వర్గం గుర్రుగా ఉంది. మొదటి నుంచి పార్టీలో ఉన్నవారికి కాకుండా ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చిన వెంకటప్పడుకు ప్రాధాన్యమివ్వడం రాజు, అనిల్ ప్రసాద్‌లతో పాటు వారి అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నాయి. దీంతోనే అన్నవరం కార్యక్రమాన్ని బహిష్కరించాయి.

వానొస్తే వణుకే.!

- బిక్కుబిక్కుమంటున్న కొండవాలు, గెడ్డల ప్రాంతాల ప్రజలు
- కళ్లముందే కొట్టుకుపోతున్న ప్రాణాలు
- ముంపు నీటిలో పాతనగరం
- యుద్ధప్రాతిపదికన చర్యలకు కమిషనర్ ఆదేశం



30వ వార్డు శాలిపేట మురుగు కాలువల్లో చెత్త తీసి.. వదలేసారిలా..



అక్కయ్యపాలెం చెన్నూరు గెడ్డలో తీసినసిల్ట్, చెత్త



చెన్నూరు గెడ్డలో పేరుకుపోయిన చెత్త

డాబాగార్డెన్స్: చిన్నపాటి వర్షానికే విశాఖ నగరం వణికిపోతోంది. అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో కురిసే వర్షాలకు నగరం ముంపునకు గురవుతోంది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, కొండవాలు, గెడ్డల సమీపంలో నివసించే ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటున్నారు. దశాబ్దాల కాలంగా పాత నగరం ముంపునకు గురవుతోంది. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయంతో తూర్పు, ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు.

ప్రమాదకరంగా గెడ్డలు

నగరంలో పలు గెడ్డల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గంగులగెడ్డ, ఎర్రిగెడ్డ సహా పలు ప్రధాన కాలువలు(గెడ్డలు) ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. పేరుకుపోయిన చెత్త, పూడికను సకాలంలో, పూర్తి స్థాయిలో తొలగించకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఫలితంగా చిన్నపాటి వర్షానికే గెడ్డలు పొంగిపొర్లి, సమీపంలోని ఇళ్లను, కాలనీలను ముంచెత్తుతున్నాయి. ఉధృతంగా ప్రవహించే ఈ గెడ్డల ప్రవాహంలో ప్రమాదవశాత్తు జారిపడితే ప్రాణాలతో బయటపడటం అసాధ్యంగా మారింది.

కళ్లెదుటే మృత్యుఘోష

ఈ గెడ్డలు ఎంత ప్రమాదకరంగా మారాయో చెప్పడానికి ఈ సంఘటనలే నిదర్శనం. 2015 సెప్టెంబర్‌లో డాక్టర్ వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ కళాశాల సమీపంలో వరద నీటి కాలువలో ఆరేళ్ల బాలిక అతిథి కొట్టుకుపోయింది. భారీ వర్షంలో రెండు మూడు రోజుల పాటు పోలీసులు, స్థానిక నివాసితులు, అగ్నిమాపక శాఖ, జీవీఎంసీ, నేవీ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. ఐదారేళ్ల కిందట దక్షిణ నియోజకవర్గంలోని గంగులగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండగా.. ఓ ఇంటి వద్ద ఉన్న వృద్ధురాలు అందరూ చూస్తుండగానే నీటిలో కొట్టుకుపోయారు. దాదాపు 20 రోజుల పాటు పొక్లెయిన్లు, క్రేన్లతో గాలించినా ఆమె జాడ తెలియరాలేదు. ఆ కుటుంబానికి తీరని శోకం మిగిలింది. తాజాగా 54వ వార్డు నలందనగర్‌లో నివాసముంటున్న ఆటోడ్రైవర్ కట్ట వడ్డీకాసులు(48) బహిర్భూమికి వెళ్లి గెడ్డలో కాలుజారి పడిపోయాడు. సుమారు 8 గంటల పాటు రెస్క్యూ బృందాలు శ్రమించినా, ఆయన్ను ప్రాణాలతో కాపాడలేకపోయాయి. చివరికి ఆయన మృతదేహాన్నే వెలికితీయగలిగారు.

మారని పాతనగరం తలరాత

పాతనగరం వాసుల కష్టాలు దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఎన్నికలొచ్చినప్పుడు నేతలు రూపురేఖలు మారుస్తామని హామీలివ్వడం, గెలిచాక మరిచిపోవడం పరిపాటిగా మారింది. రామకృష్ణా జంక్షన్, ప్రసాద్ గార్డెన్స్, వెలంపేట, పూర్ణా మార్కెట్, పెరికివీధి వంటి ప్రాంతాలు ఏ మాత్రం వర్షం కురిసినా ఇట్టే జలమయమవుతాయి. భారీ వర్షం పడితే ఇళ్లలోకి నీరు చేరి, నివాసితులు నీటిలోనే నిద్రలేని రాత్రులు గడపాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రామకృష్ణా జంక్షన్, ప్రసాద్ గార్డెన్స్, పండావీధి, వెలంపేట, పూర్ణా మార్కెట్, పెరికివీధి, రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు, స్టేడియం రోడ్డు తదితర ప్రాంతాల ప్రజలు భయం గుప్పిట్లో బిక్కుబిక్కుమంటున్నారు.

అధికారుల అరకొర చర్యలు

ప్రజల నుంచి ఒత్తిడి పెరగడంతో జీవీఎంసీ అధికారులు మేల్కొని అప్పుడప్పుడు గెడ్డల్లో పూడికతీత పనులు చేపట్టినా.. అది తూతూమంత్రంగానే సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గెడ్డల నుంచి తీసిన చెత్త, సిల్ట్‌ను అక్కడే గట్లపై వదిలేయడంతో, వర్షాలకు అది తిరిగి గెడ్డల్లోకే జారిపోతోంది. దీంతో చేసిన పనికి ఫలితం లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో నగర కమిషనర్ కేతన్ గార్గ్ సంబంధిత అధికారులతో సమీక్షించి, యుద్ధ ప్రాతిపదికన ముంపు నివారణ చర్యలు చేపట్టాలని, గెడ్డల్లో పూడికను పూర్తిగా తొలగించాలని ఆదేశాలు జారీ చేయడం కాస్త ఊరటనిచ్చే అంశం. ఈ ఆదేశాలతో ప్రధాన గెడ్డల్లో చెత్త, సిల్ట్ తొలగిస్తున్నారు. ఈ పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పెద్ద ఎత్తున చర్యలు చేపట్టాం



జీవీఎంసీ పరిధిలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చేస్తున్నాం. ముఖ్యంగా మురుగు కాలువలు, గెడ్డలపై దృష్టి పెట్టాం. గెడ్డల్లో పేరుకుపోయిన చెత్తను యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నాం. ఇప్పటికే పలు గెడ్డలు, కాలువల్లో సిల్ట్ తీయించాం. వర్షాకాలం దృష్ట్యా మలేరియా, డెంగ్యూ జ్వరాలపై సీజనల్ సర్వే నిర్వహించనున్నాం.

– కేతన్ గార్గ్, కమిషనర్, జీవీఎంసీ

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రాము (ఫైల్)

మద్దిపాలెం : తాటిచెట్లపాలెం జాతీయ రహదారి వద్ద బుధవారం వేకువజామున కారును లారీ ఢీకొట్టడంతో రాము అనే యువకుడు మృతిచెందాడు. శంకరమఠం ప్రాంతానికి చెందిన చందక రాము (25), అతడి స్నేహితులు పైడిరాజు, రాజేష్, చిరంజీవి కలిసి కారులో శంకరమఠం నుంచి ఎన్ఏడీ కూడలికి వెళ్లారు. మళ్లీ శంకరమఠం వెళ్లేందుకు ఊర్వశి జంక్షన్ మీదుగా తాటిచెట్లపాలెం సిగ్నల్ వద్ద మలుపు తిప్పుతున్న క్రమంలో మద్దిలపాలెం నుంచి ఎన్ఏడీ వైపు వెళ్తున్న గుర్తు తెలియని లారీ కారుని ఎడమ వైపు వెనుక భాగంలో బలంగా ఢీకొట్టింది. దీంతో అటువైపు కూర్చున్న రాము అక్కడికక్కడే మృతి చెందగా కారులో ఉన్న మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స కోసం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు రాము యాక్ట్ కేబుల్‌లో పనిచేస్తున్నారని, అతడికి ఏడాదిన్నర క్రితం వివాహం జరిగిందని పోలీసులు తెలిపారు. సీసీ కెమెరా ఫుటేజ్ పరిశీలిస్తున్నామని తెలిపారు.

కోర్టు క్యాంటీన్ అప్పగింత

విశాఖ లీగల్ : న్యాయవాదులు కల ఫలించింది. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత న్యాయవాదుల సంఘం కొత్త క్యాంటీన్‌ని స్వాధీనం పరుచుకుంది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, విశాఖ న్యాయవాద సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్‌కి బుధవారం సాయంత్రం క్యాంటీన్ తాళాలు అప్పగించారు. ఇకపై ఈ క్యాంటీన్ నిర్వహణ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఉంటుంది. గతంలో నెలకు రూ.90 వేలు పైగా వసూలు చేసిన రోడ్లు భవనాల శాఖ క్యాంటీన్‌ను న్యాయవాదుల సంఘానికి అప్పగించడంతో కేవలం రూ.30 వేలకే అద్దెకిస్తారు. దీనివల్ల న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి అతి తక్కువ ధరకు టిఫిన్లు, భోజనాలు లభ్యమవుతాయని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్ చెప్పారు. త్వరలోనే క్యాంటీన్‌ని ప్రారంభిస్తామన్నారు.

డెంగ్యూపై అవగాహన కల్పించండి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

అల్లిపురం : నగర ప్రజలకు డెంగ్యూపై అవగాహన కల్పించాలని జీవీఎంసీ మలేరియా అధికారులను ఆదేశించినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. జాతీయ డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా బుధవారం జీవీఎంసీ మలేరియా విభాగం, జిల్లా మలేరియా విభాగం సంయుక్తంగా జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రజలు ఇంటి వద్ద వర్షం నీరు నిల్వ లేకుండా చూడాలని, ఇంట్లో ప్రతి మూడు రోజులకు ఒకసారి మంచి నీటిని మార్చాలని, ఇంటిపైన వాటర్ ట్యాంకులకు పూర్తిగా మూతలు బిగించి ఉంచాలని, కొబ్బరి బొండాలు, ఖాళీ సీసాలు, ఫ్రిడ్జ్ వెనుక భాగంలో ఉన్న నీటి నిల్వలు, పూల కుండీల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమతెరలు ఉపయోగించాలని, కాళ్లు, చేతులకు పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలని, ఇంటి కిటికీలకు మెస్‌లు అమర్చాలని తెలిపారు. జీవీఎంసీ ప్రజా ఆరోగ్య విభాగంలోని మలేరియా సిబ్బంది డోర్ టు డోర్ వెళ్లి ఇంటి పరిసరాలను పరిశీలించి ప్రజలకు డెంగ్యూ వ్యాధి నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ కేపీఎస్ ప్రసాద్, జిల్లా మలేరియా అధికారిని ఎమ్.తులసి, జీవీఎంసీ బయాలజిస్ట్ డి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల అవసరాలే వ్యాపార అభివృద్ధికి కీలకం

ఆర్ఏఐ సీఈవో కుమార్ రాజగోపాలన్

ఏయూ క్యాంపస్: వినియోగదారుడి అవసరాలు తెలుసుకుంటేనే వ్యాపార అభివృద్ధి సాధ్యపడుతుందని రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఆర్ఏఐ) సీఈవో కుమార్ రాజగోపాలన్ అన్నారు. బుధవారం బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన విశాఖపట్నం రిటైల్ సమ్మిట్‌ను సీఎంఆర్ అధినేత మావూరి వెంకట రమణ, కంకటాల సంస్థల అధినేత కంకటాల మల్లికార్జునరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమార్ రాజగోపాలన్ మాట్లాడుతూ నేటితరం రిటైల్ మార్కెటింగ్‌లో వేగం, కచ్చితత్వం ప్రధానంగా మారాయన్నారు. సృజనాత్మకంగా ఉంటూ తమ బ్రాండ్‌ను నిలుపుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. భారత ఆర్థిక వ్యవస్థపై రిటైల్ రంగం ఎంతో ప్రభావాన్ని చూపుతుందని, ఉపాధి కల్పనతో పాటు జీడీపీ వృద్ధికి దోహదపడుతోందన్నారు. మావూరి వెంకట రమణ మాట్లాడుతూ కలసి ప్రయాణించడం, ఆలోచనలను పంచుకోవడం ఎంతో అవసరమన్నారు. కంకటాల మల్లికార్జునరావు మాట్లాడుతూ రిటైల్ వ్యాపారాన్ని ఆస్వాదించే దృక్పథం ఉంటేనే కొనసాగాలన్నారు. మన కష్టాన్ని పెట్టాలని, ఫలితం వెంటనే ఆశించడం సరికాదన్నారు. సంస్థలో పనిచేసే ఉద్యోగులపై నమ్మకం ఉంచడం, వారి ఆత్మస్థైర్యాన్ని రెట్టింపు చేస్తూ, వారిలోని లోపాలను రూపు మాపే ప్రయత్నం చేయాలన్నారు. వినియోగదారుడితో మసలుకునే విధానం, వారితో సంభాషించే విధానం వ్యాపారాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తాయన్నారు. నాలుగు దశాబ్దాలుగా రిటైల్ వ్యాపార రంగంలో తాను స్వయంగా తెలుసుకున్న అనేక సూత్రాలను, నైపుణ్యాలను వివరించారు.

తెలుగు రాష్ట్రాల్లో రిటైల్ రంగం అభివృద్ధి

హైదరాబాద్ ఆర్ఏఐ ప్రాంతీయ శాఖ చైర్మన్ అవినాష్ ఆనంద్ మాట్లాడుతూ దక్షిణాదిలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రిటైల్ రంగం ఆశించిన స్థాయిలో అభివృద్ధి సాధిస్తోందన్నారు. అంతర్జాతీయ బ్రాండ్‌లు సైతం భారత్‌కి రావడానికి ఆసక్తి చూపుతున్నాయన్నారు. ఆగస్టు 6న హైదరాబాద్‌లో ఆర్ఏఐ సమ్మిట్ జరుగుతుందని, అందరూ పాల్గొనాలని ఆహ్వానించారు. విశాఖ వేదికగా రిటైల్ రంగానికి ఆశాజనకంగా ఉంటుందన్నారు. అనంతరం నిర్వహించిన చర్చావేదికలో భవిష్యత్తులో వినియోగదారుల వస్తు ప్రభావం అనే అంశంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. మెట్రో నగరాలతో పాటు ఇక్కడి పరిస్థితులను, అవకాశాలను వివరించారు. టైర్-2, టైర్-3 నగరాల్లో వస్తున్న మార్పులపై విస్తృతంగా చర్చించారు.

6న స్విమ్మింగ్ జిల్లా జట్ల ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర సబ్ జూనియర్, జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 6న బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ స్విమ్మింగ్ పూల్‌లో జరగనుంది. జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో 11 నుంచి 17 ఏళ్ల వారికి మూడు గ్రూపుల్లో ఎంపికలు నిర్వహించనున్నారు. ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్‌ఫ్లైలతో పాటు వ్యక్తిగత మెడ్లీలోనూ ఎంపికలు జరుగుతాయి. ఎంపికల్లో పాల్గొనేవారు నాలుగో తేదీలోగా వేదిక వద్ద పేర్లను నమోదు చేసుకోవాలని సంఘం కార్యదర్శి మోహన్‌రామ్ కోరారు.



రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్



తాటిపూడి రిజర్వాయర్ వద్ద తారురోడ్లను ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి, మేయర్ పీలా శ్రీనివాసరావు

అల్లిపురం: రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన విజయనగరం జిల్లా మధుపాడ గ్రామం కృష్ణాపురం వాటర్ హెడ్ వర్క్స్ వద్ద సుమారు రూ.2.64 కోట్ల జీవీఎంసీ నిధులతో నిర్మించిన తారు రోడ్లను మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. విశాఖ నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు అవసరమయ్యే మౌలిక వసతుల కల్పనకు జీవీఎంసీ కృషి చేస్తుందని మేయర్ అన్నారు. నగర ప్రజలకు తాటిపూడి రిజర్వాయర్ ద్వారా మంచినీరు సరఫరా అవుతుందన్నారు. అనంతరం తాటిపూడి వాటర్ హెడ్ పైప్‌లైన్ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజినీరు మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని వేధిస్తున్న యువకుడి అరెస్ట్

విశాఖ సిటీ : ఇన్‌స్టాగ్రామ్‌లో విద్యార్థినిని పరిచయం చేసుకుని, ఆమె ప్రైవేట్ ఫొటోలు సేకరించి బెదిరిస్తున్న యువకుడిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొద్ది రోజుల క్రితం నగరానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థినికి తన సీనియర్ ఇన్‌స్టాగ్రామ్ నుంచి మెసేజ్ వచ్చింది. మాయమాటలతో విద్యార్థినిని పరిచయం చేసుకున్న యువకుడు... కొన్నాళ్ల చాటింగ్ తర్వాత ఆమెను మభ్య పెట్టి న్యూడ్ వీడియో కాల్ చేయించుకుని రికార్డు చేశాడు. కొద్ది రోజులకు విద్యార్థిని ఫొటోలను ఆమె తల్లి వాట్సాప్ నంబర్‌కు పంపించాడు. తనకు డబ్బులు ఇవ్వకపోతే ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో ఆమె వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతికత సహాయంతో కోనసీమ జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అక్కడకు వెళ్లి అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బీచ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

తగరపువలస: పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో బీచ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి.బాబూరావు అవినీతికి పాల్పడటంతో.. బుధవారం అతనిని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సస్పెండ్ చేశారు. కానిస్టేబుల్ బాబూరావు ఒక వైన్ షాపులో పనిచేస్తున్న వ్యక్తి నంబర్‌ను సేకరించి, వేరే వ్యక్తి ఫోన్‌పే ద్వారా అతనికి కొంత నగదును పంపించాడు. ఆ తర్వాత ఆ నగదును తనకు ఆన్‌లైన్ ద్వారా పంపించుకున్న విషయం ప్రత్యేక నిఘాలో బయటపడింది. ఇది ప్రాథమిక విచారణలో నిర్ధారణ కావడంతో తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేశారు. నగర పరిధిలో పోలీస్ సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని, ఎవరైనా అవినీతికి పాల్పడితే తక్షణమే చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. పోలీసులు సిబ్బంది ఎక్కడైనా లంచం అడిగితే 79950 95799కు ఫిర్యాదు చేయాలని, అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు.

ఏయూలో బీబీఏ, ఎంబీఏ ప్రవేశాలు

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీలో బీబీఏ(బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్), ఎంబీఏ(మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులను అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య డి.ఎ.నాయుడు తెలిపారు. సెల్ఫ్ సపోర్టింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా మూడేళ్ల బీబీఏ కోర్సుతో పాటు ఐదేళ్ల బీబీఏ ఎంబీఏ కోర్సులకు ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ కోర్సులకు సంబంధించి ఏడాదికి రూ.1.5 లక్షలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మొదటి విడత ఫీజును ఈ నెల 15వ తేదీలోగా చెల్లించాలి. 18న గ్రూప్ డిస్కషన్, 19న సీట్ అలాట్‌మెంట్ చేస్తారు. మిగిలిన ఫీజును 21 నుంచి 30వ తేదీ లోగా చెల్లించాలని డైరెక్టర్ తెలిపారు.

కె.కె.లైన్‌లో విరిగిపడిన కొండచరియలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ కోరాపుట్-కిరండూల్ లైన్ మల్లిగూడ-జరాటి స్టేషన్ల మధ్య కొండచరియలు విరిగిపడడంతో బుధవారం పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ కారణంగా ఈ మార్గంలో నడిచే రైళ్లను రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. బుధవారం కిరండూల్-విశాఖపట్నం(18516) నైట్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు. గురువారం విశాఖపట్నం-కిరండూల్(18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. విశాఖపట్నం-కిరండూల్ (58501) పాసింజర్ అరకు వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్-విశాఖపట్నం (58502) పాసింజర్ అరకు నుంచి బయలుదేరుతుంది.

అంతర్జాతీయ స్థాయిలో టూరిజం ప్రాజెక్టులు



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్

మహారాణిపేట : అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విశాఖలో టూరిజం ప్రాజెక్టుల రూపకల్పన జరగాలని, భవిష్యత్‌లో స్టార్ రేటింగ్ కలిగిన 10 వేల రూమ్‌లు అందుబాటులోకి తేవాల్సి ఉందని రాష్ట పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ అన్నారు. బుధవారం జిల్లాకు విచ్చేసిన ఆయన విజయనగరం, విశాఖ జిల్లాల అధికారులతో స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాలులో సమావేశమయ్యారు. తొలుత ఉమ్మడి జిల్లాల్లో చేపట్టబోయే టూరిజం ప్రాజెక్టులపై సమీక్షించి, సూచనలు చేశారు. భోగాపురం మండల పరిధిలో నిర్మించబోయే ఒబెరాయ్ హోటల్, విశాఖ జిల్లా భీమిలి మండల పరిధిలోని అన్నవరంలో నిర్మించే మై ఫెయిర్స్ హోటల్ నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని, నిర్ణీత సమయంలోగా ఆయా కంపెనీలకు భూమిని అందజేయాలని ఆదేశించారు. కనెక్టింగ్ రోడ్లు నిర్మించాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. గోస్తనీ నది నుంచి పైప్‌లైన్ల ద్వారా ఆయా హోటళ్ల తాగునీటి అవసరాలకు తగ్గట్టుగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విశాఖ జిల్లాలో చేపట్టబోయే టూరిజం ప్రాజెక్టులు, పర్యాటక శాఖ పరిధిలో ఉన్న భూముల క్రమబద్ధీకరణ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. నగర పరిధిలో చేపట్టబోయే ప్రాజెక్టులు, భూసేకరణ ప్రక్రియపై స్పెషల్ సీఎస్‌కు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ వివరించారు. వీఎంఆర్డీఏ కమిషనర్ కె.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జేసీ కె.మయూర్ అశోక్, విజయనగరం జేసీ సేతుమాధవన్, ఒబెరాయ్, మై ఫెయిర్స్ హోటళ్ల ప్రతినిధులు శంకర్, మనోజ్, విజయనగరం ఆర్డీవో కీర్తి, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ షాపుల నుంచే మద్యం కొనుగోలు చేయాలి

విశాఖ సిటీ: ఆంధ్ర ప్రదేశ్ ఎక్సైజ్ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆర్.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అనధికార వ్యక్తుల నుంచి మద్యం కొనుగోలు చేయడం ప్రమాదకరమని స్పష్టం చేశారు

వాన వాన



మహారాణిపేట: అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో బుధవారం విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో ద్విచక్ర వాహనచోదకులు, చిరు వ్యాపారులు అవస్థలు పడ్డారు. జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలివి.. సీతమ్మధారలో అత్యధికంగా 22.2 మిల్లీమీటర్లు, రూ రల్, 20.8, ఆనందపురం 20.6, మహారాణిపేట 19.6, పెందుర్తి 18.4, గోపాలపట్నం 18.2, పద్మనాభం 16.8, ములగాడ 15.8, పెదగంట్యాడ 15.0, గాజువాకలో 10.4(అత్యల్పం) మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

ఆథరైజ్డ్ టిక్కెట్ బుకింగ్ ఏజెంట్లకు దరఖాస్తులు

మద్దిలపాలెం: ఏపీఎస్ఆర్టీసీ సుదూర ప్రాంతాల బస్సులకు రిజర్వేషన్ బుకింగ్ చేయుటకు సిటీ పరిధిలో ఆథరైజ్డ్ టికెట్ బుకింగ్ ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు బుధవారం తెలిపారు. విశాఖ రీజియన్ నుంచి హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, కడప, ప్రొద్దుటూరు, కర్నూలు, శ్రీశైలం, జైపూర్, నౌరంగాపూర్, గుణుపూర్, పర్లాకిమిడి రూట్లలో ముందుగా రిజర్వేషన్ బుకింగ్‌లు చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 73829 17169 నంబర్‌లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

లోపం కలిగిన వస్తువు విక్రయించినందుకు పరిహారం

విశాఖ లీగల్ : లోపం కలిగిన వస్తువు విక్రయించినందుకు పరిహారం చెల్లించాలని వినియోగదారుల కమిషన్ – 2 న్యాయమూర్తి జి.వెంకటేశ్వరి తీర్పునిచ్చారు. రూ.2 లక్షల పరిహారంతోపాటు వాచీ ఖరీదు రూ.25,362లను 24 శాతం వడ్డీతో చెల్లించాలని, అలాగే కోర్టు ఖర్చులకు రూ.20 వేలు చెల్లించాలని టైటాన్ కంపెనీ యాజమాన్యాన్ని న్యాయమూర్తి, సభ్యులు పి.విజయదుర్గ, డాక్టర్ కె.రమణబాబు ఆదేశించారు. ఫిర్యాది అబ్దుల్ నగరంలోని శంకరరావు పేటలో ఉంటున్నారు. 2024 మార్చి 14న జగదాంబ జంక్షన్‌లోని టైటాన్ షోరూమ్‌లో రూ.25,362 చెల్లించి వాచ్ కొనుగోలు చేశారు. తర్వాత ఆ వాచీ పనిచేయలేదు. రెండు మూడు సార్లు మరమ్మతులు చేయించినా పని చేయకపోవడంతో వాచీలో లోపం ఉన్నట్లు గుర్తించి కంపెనీ యాజమాన్యానికి రాతపూర్వకంగా తెలియజేశారు. తనకు కలిగిన నష్టాన్ని భర్తీ చేయాలని కోరుతూ కొత్త వాచీ కోసం వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఇరువర్గాల వాదనలు విన్న కమిషన్ పైవిధంగా తీర్పునిచ్చింది.